AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
18-5-2026 (Monday)
MAIN EDITION

## ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యం: పొంగులేటి



**అక్షరటుడే, హైదరాబాద్ :** ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడడమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన, శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వద్ద నిర్వహించిన భారీ వరద మాక్ డ్రిల్‌ను సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు.

## రైలులో చెలరేగిన మంటలు.. తప్పిన ప్రమాదం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్‌లోని ససారం రైల్వే స్టేషన్‌లో పాట్నాకు వెళ్తున్న ఒక ప్యాసింజర్ రైలులో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో పలు బోగీలు కాలిపోయాయి. ససారం రైల్వే స్టేషన్‌లో సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ప్యాసింజర్ రైలులో మంటలు చెలరేగాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగిందని అనుమానిస్తున్నారు. అగ్నిప్రమాదంతో ప్లాట్‌ఫాంపై ఉన్న ప్రయాణికులలో భయాందోళనలు నెలకొన్నప్పటికీ, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక బృందం సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు.

## మరింత పడిపోయిన రూపాయి విలువ

**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** రూపాయి విలువ మరింత పడిపోయింది. డాలర్ ముందు భారత కరెన్సీ మరోసారి బలహీనపడింది. క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదలతో మార్కెట్‌పై భారీ ఒత్తిడి పడగా.. రూపాయి విలువ చరిత్రలోనే కొత్త కనిష్ఠానికి చేరుకుంది. రూ. 96.28కు పడిపోయింది.



## పెరిగిన రియల్ మీ ఫోన్ల ధరలు

**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** కొత్తగా మొబైల్ కొనుగోలు చేయాలనుకుంటున్న వారికి రియల్ మీ సంస్థ షాక్ ఇచ్చింది. పలు రకాల మొబైల్స్ ధరలను పెంచింది. రియల్ మీ తన 16 స్మార్ట్‌ఫోన్ శ్రేణికి సంబంధించిన విక్రయ ధరలను పెంచినట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ పెంపు నేటి నుంచి అమలులోకి వచ్చింది.




## గాలిలో ఢీకొన్న రెండు యుద్ధ విమానాలు

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అమెరికాకు చెందిన రెండు యుద్ధ విమానాలు గాలిలో ఢీకొన్నాయి. ఇడాహోలో గన్‌ఫైటర్ స్కైప్ ఎయిర్ షోలో భాగంగా విన్యాసాలు చేస్తుండగా ప్రమాదం జరిగింది. విమాన శకలాలు కిందపడగానే భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పారాచూట్ సాయంతో పైలట్లు బయటపడ్డారు.





## రైలులో మహిళ మృతదేహం కలకలం

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** రైలులో మహిళ మృతదేహం కలకలం రేపింది. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లో చోటు చేసుకుంది. మహిళ మృతదేహాన్ని ముక్కలుగా చేసి బ్యాగ్, పెట్టెలో పెట్టి రైలులో వదిలి వెళ్లారు. లక్నో రైల్వే ఎస్పీ రోహిత్ మిశ్రా తెలిపిన వివరాల ప్రకారం.. ఛప్రా నుంచి గోరఖ్‌పూర్ మీదుగా గోమతి నగర్ వెళ్లే ఒక రైలులో సిబ్బంది సాధారణ తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో స్లీపర్ కోచ్‌లో వారికి ఒక పెట్టె, బ్యాగ్ కనిపించాయి. వెంటనే ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు ఆ పెట్టె, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిని తెరిచి చూడగా.. మహిళ మృతదేహం ముక్కలు ముక్కలుగా ఉంది. తల లేకుండా మొండెం మాత్రమే ఉండడం గమనార్హం.

## మండుతున్న ఎండలు.. ఏడు జిల్లాలకు రెడ్ అలెర్ట్

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటలకే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. దీంతో ప్రజలు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. రాష్ట్రంలో హీట్ వేవ్ ప్రభావంతో రానున్న నాలుగు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఆదిలాబాద్, మంచిర్యాల, కొమురం భీం, జగిత్యాల, సిరిసిల్ల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు.



రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్క్ వద్ద చెట్లు కొట్టొద్దని ఆదేశించింది. ఈ మేరకు పనులపై స్టే విధించింది. పార్కు వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అక్కడ అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. చెట్లు నరికి వేయడాన్ని నిరసిస్తూ ఓ వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం స్టే ఇచ్చింది.

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# చెట్లు నరకొద్దు

■ కేబీఆర్ పార్కు వద్ద పనులపై సుప్రీం స్టే ■ జూలై 27కు విచారణ వాయిదా ■ నిలిచిపోనున్న ఫ్లై ఓవర్, అండర్ పాస్ పనులు

హైదరాబాద్‌లోని కాసు బ్రహ్మానంద రెడ్డి జాతీయ పార్కు వద్ద నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో అక్కడ ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని ప్రభుత్వం భావించింది. వ్యూహాత్మక రహదారి అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్డీపీ) ఫ్లైఓవర్ పనులను చేపడుతోంది. ఇందుకోసం వందలాది చెట్లను నరికి వేస్తున్నారు. దీంతో నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. పర్యావరణ ప్రేమికులు చెట్లు నరకొద్దని కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు.

### సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు బి.వి.నాగరత్న, ఉజ్జల్ భూయాన్ సోమవారం వాదనలు విన్నారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కె.వివేక్ రెడ్డి వాదించారు. హైకోర్టు సెలవుల సమయంలో ప్రభుత్వం పర్యావరణ సున్నిత ప్రాంతం పరిమితులను తగ్గించడానికి ప్రయత్నిస్తూ, చెట్ల నరికివేతను వేగవంతం చేస్తోందని సుప్రీంకోర్టుకు తెలిపారు. 1300 చెట్లను నరికేస్తున్నారని వివరించారు. రోజుకు 50 చెట్లు కొట్టేస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. పర్యావరణ సున్నిత ప్రాంతంలో చెట్లను నరకవద్దని గతంలో ఉత్తర్వులు ఉన్నాయని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం చెట్లు నరుకుతోందన్నారు.

### ప్రభుత్వానికి నోటీసులు

వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జూలై 27కు విచారణను వాయిదా వేసింది. అప్పటి వరకు కేబీఆర్ జాతీయ ఉద్యానవనం పరిధిలోని పర్యావరణ సున్నిత ప్రాంతంలో (25 నుంచి 35 మీటర్ల వరకు) చెట్లను నరకొద్దని ఆదేశించింది. దీంతో కేబీఆర్ వద్ద ప్రస్తుతం చేపడుతున్న పనులు ఆగిపోనున్నాయి.

## నార్వేలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నార్వే చేరుకున్నారు. స్వీడన్ పర్యటన ముగించుకొని ఆయన నార్వేలోని ఓస్లోలో ల్యాండ్ అయ్యారు. అక్కడ ప్రధానికి ఘన స్వాగతం లభించింది. విమానాశ్రయంలో నార్వే ప్రధానమంత్రి జోనాస్ గార్ స్టోర్ తనకు ఇచ్చిన ఆత్మీయ స్వాగతానికి కృతజ్ఞుడను అని మోదీ పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఫొటోలు పంచుకున్నారు. 40 ఏళ్లకు పైగా కాలంలో ఒక భారత ప్రధానమంత్రి నార్వేలో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటన భారత్, నార్వేల మధ్య స్నేహాన్ని మరింత బలపరుస్తుందని మోదీ అన్నారు. కాగా.. ఆ దేశ మహారాజు హెరాల్డ్, మహారాణి సోంజా, ప్రధానమంత్రి స్టోర్‌తో మోదీ చర్చలు జరపనున్నారు.



## క్రీడా వారోత్సవాలను ప్రారంభించిన మంత్రులు



**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఫిట్‌నెస్, క్రీడా సంస్కృతి, యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం క్రీడా వారోత్సవాలను నిర్వహిస్తోంది. మే 18 నుంచి మే 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ వేడుకలను మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. హైదరాబాద్ నగరంలోని ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో క్రీడా వారోత్సవాలను మంత్రులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన, చురుకైన జీవనశైలిని అలవర్చుకోవాలని యువతను ప్రోత్సహించడానికి ప్రభుత్వం క్రీడా వారోత్సవాలను నిర్వహిస్తోందని మంత్రులు తెలిపారు.

## కవిత జైలుకెళ్తే కేసీఆర్ రాజీనామా చేశారా? : రాంచందర్ రావు



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్న బండి భగీరథ్ కేసు విషయమై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఆయన కుమారుడు భగీరథ్‌ను లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బండి సంజయ్ ఎలాంటి తప్పు చేయలేదని, ఒకవేళ ఆయన తప్పు చేసి ఉంటే పార్టీ కచ్చితంగా చర్యలు తీసుకునేదని స్పష్టం చేశారు. ఆ కుటుంబంలో కేంద్ర మంత్రి ఉన్నారనే ఒకే ఒక్క కారణంతో రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత జైలుకు వెళ్లినప్పుడు కేసీఆర్, కేటీఆర్ తమ పదవులకు రాజీనామా చేశారా?" అని ఆయన ప్రశ్నించారు.

## యోగా నా జీవితాన్ని మార్చేసింది..

'మహానటి' ఫేమ్ కీర్తి సురేశ్ తన లుక్‌పై వస్తున్న సర్జరీ పుకార్లు, బాడీ షేమింగ్‌కు కౌంటర్ ఇచ్చారు. తాను ఎలాంటి సర్జరీలు చేయించు కోలేదని తెలిపారు. కేవలం సహజ పద్ధతుల్లోనే ఫిట్‌నెస్ సాధించానని ఇన్ స్టా వేదికగా స్పష్టం చేశారు. 'మహానటి' తర్వాత హై-ప్రోటీన్ డైట్ ద్వారా తొమ్మిది నెలల్లో 10 కిలోల బరువు తగ్గానని.. 2020లో ప్రారంభించిన యోగా తన జీవితాన్ని మార్చేసిందని పేర్కొన్నారు. ఒకప్పుడు లావుగా ఉన్నావని, ఇప్పుడు సన్నబడ్డాక గతంలోనే బాగున్నావని అంటున్నారంటూ.. సమాజం ఆలోచనా విధానంపై ఆవేదన వ్యక్తం చేశారు.

—అక్షరటుడే, సినిమాడెస్క్



## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. నల్గొండ జిల్లా యువతి మృతి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్గొండ జిల్లాకు చెందిన యువతి మృతి చెందింది. నార్కెట్‌పల్లి మండలం చెరువుగట్టు గ్రామానికి చెందిన నవ్య షికాగోలో రూజ్ వెల్ట్ యూని వర్సిటీలో ఎంఎస్ చదువుతోంది. శ్రీనివాస్‌రెడ్డి కుమార్తె నవ్య రెండున్నరేళ్ల క్రితం ఎంఎస్ చదవడానికి అమెరికా వెళ్లింది. అక్కడ చదువు పూర్తవడంతో పార్ట్ టైం ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో స్నేహితులతో కలిసి కారులో పార్ట్ టైమ్ ఉద్యోగానికి వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన మరో కారు వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారు వెనుక సీట్లో కూర్చోవడంతో నవ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.



## ఇరాన్ మ్యాప్‌పై అమెరికా జెండా..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ కొనసాగుతున్నా.. ఉద్రిక్తతలు మాత్రం చల్లారడం లేదు. శాంతి చర్చలు కొలిక్కి రాకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ఇరాన్‌ను రెచ్చగొట్టేలా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. డొనాల్డ్ ట్రంప్ సోమవారం సోషల్ మీడియాలో పశ్చిమ ఆసియా మ్యాప్‌ను షేర్‌చేశారు. అందులో అన్ని దేశాలపై అమెరికా జెండా ఉంది. పలు దిశల నుంచి ఇరాన్ వైపు ఎర్ర బాణాలను చూపించారు. ఇది వాషింగ్టన్, టెహ్రాన్‌ల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసింది. సంఘర్షణను ముగించే లక్ష్యంతో అమెరికా తెచ్చిన శాంతి ప్రతిపాదనను ఇరాన్ అంగీకరించడానికి "సమయం మించిపోతోంది" అని ట్రంప్ హెచ్చరించిన కొద్దిసేపటికే ఈ పోస్ట్ వచ్చింది.




## స్విమ్మింగ్ పూల్‌లో పడి యువకుడి మృతి



**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ :** స్విమ్మింగ్ పూల్‌లో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన హైదరాబాద్ శివారులోని మొయినాబాద్ మండలంలో చోటు చేసుకుంది. మొయినాబాద్ మండలం కనకమామిడి శివారులోని వ్యాస ఫామ్ హౌస్ ఉంది. ఇందులో జరిగిన బర్త్ డే పార్టీకి హైదరాబాద్ మజీద్‌బండకు చెందిన సాయి హాజరయ్యాడు. అతడు యాక్సిస్ బ్యాంక్ సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఆదివారం రాత్రి పుట్టిన రోజు వేడుకల్లో సాయి స్విమ్మింగ్ పూల్‌లో పడి చనిపోయాడు. అయితే ఎవరు అతడిని గమనించలేదు. సోమవారం ఉదయం ఫామ్‌హౌజ్ వాచ్‌మన్ గమనించి స్నేహితులకు సమాచారం ఇచ్చారు. స్విమ్మింగ్ పూల్ నుంచి సాయిని తీసి వెంటనే స్నేహితులు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు తమ కుమారుడి మృతిపై వారు అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.